# సామ్రాజ్యవాద లొంగుబాటు పాలకుల దోపిడీ విధానాల కొనసాగింపే

# మోడీ ప్రభుత్వం ముందుకు తెచ్చిన మూడు వ్యవసాయ వ్యతిరేక చట్టాలు

**పాలకులు** రుద్దిన కరోనా సంక్షోభంలో దేశప్రజానీకం చిక్కుకొని వున్న సమయంలో-ఈ సం॥జూన్ నెలలో-కేంద్రప్రభుత్వం రైతాంగానికి వ్యతిరేకమైన మూడు ఆర్డినెన్సులను తెచ్చింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో ఈ ఆర్డినెన్స్‌లకు చట్టరూపమిచ్చింది. ఈ చట్టాలు వ్యవసాయానికి, రైతాంగానికి మాత్రమేగాక దేశ ప్రజలందరి ప్రయోజనాలకు వ్యతిరేకమైనవి. అంతేగాక, 'అధికారమార్పిడి' నాటి నుండి దేశాన్ని పాలిస్తున్న పాలకుల సామ్రాజ్యవాద లొంగుబాటు విధానాల కొనసాగింపులో భాగంగానే ఈ చట్టాలను అర్థంచేసుకోవాలి.

ఈ చట్టాలతో రైతాంగాన్ని బంధ విముక్తుల్ని చేస్తామని, వ్యవసాయం మరింత లాభసాటిగా మారుతుందని అధికార రాజకీయ నాయకులు, పాలకపక్ష మేధావులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాపితంగా వెల్లువెత్తుతున్న నిరసనలను, అభివృద్ధి నిరోధకమైనవిగా పేర్కొంటూ కొట్టి వేస్తున్నారు. ఆ మూడు చట్టాలు ఇవి: 1. రైతు ఉత్పత్తుల వ్యాపార, వాణిజ్య (ప్రోత్సాహకం, సులభతరం) చట్టం. 2. రైతుల(సాధికారత, రక్షణ)ధరల హామీ, సేవల ఒప్పందచట్టం. 3. నిత్యావసర సరుకుల(సవరణ)చట్టం-ఈ చట్టాల మంచి, చెడ్డలను పరిశీలించబోయే ముందు, ఇంతకాలంగా మనదేశ పాలకులు వ్యవసాయాన్ని, రైతాంగాన్ని ఏవిధంగా దివాలా తీయించి, దగా చేస్తూ వస్తున్నారో సింహావలోకనం చేసుకుందాం.

### సామ్రాజ్యవాదులకు దాసోహం- దేశ రైతాంగానికి విద్రోహం

బ్రిటిష్ వలసపాలకులు తమ పాలనా కాలంలో బలప్రయోగంతో మనదేశ వ్యవసాయాన్ని వారి ప్రయోజనాలకనుగుణంగా మలిచారు. తమ వ్యాపారానికి అవసరమైన పంటలు పండించాలని రైతులను క్రూరంగా హింసించారు. అధికారమార్పిడి తదనంతరం పాలన సాగిస్తున్న ప్రభుత్వాలన్నీ వ్యవసాయంలో స్వావలంబనకోసం, స్వయంపోషకం కోసం ప్రయత్నాలేమీ చేయకపోగా మనదేశాన్ని వివిధ సామ్రాజ్యవాద దేశాల లాభాల పంటభూమిగా మార్చారు.

దేశంలో పెరుగుతున్న జనాభా అవసరాల కనుగుణంగా ఆహార, వ్యవసాయ ఉత్పత్తులు పెంచాలనే పేరున 1966లో 'హరిత విప్లవాన్ని' ప్రారంభించారు. సంకరజాతి వంగడాలను ప్రవేశపెట్టారు. దీనితో రసాయన ఎరువుల వాడకమేగాక, చీడపీడల నిరోధానికి రసాయన పురుగుమందుల వాడకమూ పెరిగింది. అమెరికా సామ్రాజ్యవాద వ్యవసాయ వాణిజ్య గుత్తసంస్థలు కాలంచెల్లిన తమ వ్యవసాయ పరికరాల అమ్మకాలకు, రసాయన ఎరువుల- పురుగుమందుల భారీస్థాయి అమ్మకాలకు మనదేశాన్ని ప్రధాన మార్కెట్‌గా చేసుకుని లాభాలు గడించాయి.

తామనుసరించిన ముందుచూపు విధానాల ఫలితంగా ఆహార, వ్యవసాయ ఉత్పత్తులలో పెరుగుదల సాధ్యమైందని మాత్రమే పాలకులు ప్రకటిస్తున్నారు. కానీ ఈ పంటల ఉత్పత్తికోసం రైతులు గతంకంటే ఎన్నిరెట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తున్నదో చెప్పకుండా దాచిపెడు తున్నారు.

ప్రత్యేకించి 1991 సం॥నుండి పాలకులు అనుసరిస్తూ వస్తున్న, సామ్రాజ్యవాదులు నిర్దేశించిన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలతో మనదేశ వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను మరింతగా పరాధీనం చేసే ప్రక్రియ వూపందుకుంది. దేశ, ప్రజల అవసరాలను విస్మరించిన మనదేశ పాలకులు సామ్రాజ్యవాదులకు లోబడిన విధానాలనే మరింత బరితెగించి, బాహాటంగా అమలుచేస్తూ వస్తున్నారు.

సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థల ఆదేశాల మేరకు పాలకులు రైతాంగానికి అందించే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, సాగునీరు, విద్యుత్తుల ధరలను పెంచివేశారు. ప్రోత్సాహకంగా రైతులకందించిన సబ్సిడీ లన్నింటినీ రద్దుచేస్తూ వస్తున్నారు. పండిన పంటను కొనుగోలుచేసే ప్రభుత్వ సంస్థలను నిస్తేజం చేశారు. పంటల మార్కెట్‌పై ప్రభుత్వ నియంత్రణను ఎత్తివేశారు. పండిన పంటకు ధర నిర్ణయించే అంశాన్ని సామ్రాజ్యవాద సంస్థల దయాదాక్షిణ్యాలకు వదలివేశారు. వ్యవసాయ పంటలలో చట్టావ్యాపారాన్ని, భవిష్యవాణిజ్యాన్ని అనుమతించారు. ప్రభుత్వ పెట్టుబడుల మదుపు తగ్గించివేశారు. మరోవైపున సంస్థాగత రుణ సౌకర్యాన్ని కుదించివేస్తూ, రైతులు ప్రైవేటు వడ్డీవ్యాపారులపై ఆధారపడే దుస్థితి కల్పించారు. ఈవిధంగా సాగుఖర్చులు పెరగటం, చివరకు పంటలకు పెట్టిన ఖర్చులు కూడా తిరిగి చేతికి రాని పరిస్థితుల్లో రైతులు - ముఖ్యంగా మధ్య తరగతి, పేద రైతాంగం, కౌలురైతులు-సన్న- చిన్నకారు రైతులుగా, వ్యవసాయకూలీలుగా దిగజారిపోతున్నారు. లక్షల సంఖ్యలో రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. భూములను కోల్పోతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఆర్థిక మీటలతో రైతాంగాన్ని భూములనుండి

గెంటివేసే ఈ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. భూస్వామ్యవర్గ దాడులు, పోలీసు కాల్పులు, రక్తపాతం వంటివేమీ కనబడకుండానే రైతాంగాన్ని భూములనుండి దూరంజేసే కుట్రపూరిత విధానాలను వేగంగా అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మోడీ ప్రభుత్వం ముందుకు తెచ్చిన మూడు చట్టాలను పరిశీలిద్దాం.

### రైతు ఉత్పత్తుల వ్యాపార, వాణిజ్య(ప్రోత్సాహకం, సులభతరం)చట్టం

రైతులు తాము పండించిన పంటలకు స్థానికంగా సరైన ధర లభ్యం కాదనుకుంటే, దేశంలో ఎక్కడికైనా ఆ పంటను తీసుకెళ్ళి మెరుగైన ధరకు అమ్ముకునేందుకు ఈ చట్టం స్వేచ్ఛ కల్పిస్తోందంటున్నారు. ఈ పేరున మద్దతు ధరల ప్రకటనను, మార్కెట్ యార్డులను క్రమంగా ఎత్తివేసి, బడావ్యాపారుల, బహుళజాతి దళారీ కంపెనీల ముందు రైతాంగాన్ని నిర్దాక్షిణ్యంగా బలిచేయటమే జరుగుతుంది. దీనికి ముందస్తుగా మోడీ ప్రభుత్వం 2016లోనే ఈ-నామ్ (ఎలక్ట్రానిక్- నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్)ల ఏర్పాటుతో మార్కెట్ యార్డుల ఎత్తివేతకు రంగం సిద్ధంచేసింది. మరోవైపున స్థానిక యార్డులలోని చిన్న వ్యాపారులందరినీ తొలగించి, బడా వ్యవసాయ వాణిజ్య సంస్థలు ముందుకు వస్తాయి.

రైతుల కుటుంబశ్రమ, ఉత్పాదక ఖర్చు, కౌలు, వడ్డీలు మొదలైన అంశాలను పరిగణలోకి తీసుకొని అన్ని పంటలకూ న్యాయమైన ధరలను నిర్ణయించి, ప్రభుత్వ సంస్థలే ఆ పంటలను కొనుగోలు చేయాల్సి వుండగా, ధరల నిర్ణయాన్ని బహుళజాతి వ్యవసాయ వాణిజ్య సంస్థలకు వదలి వేస్తున్నారు. దీనితో రైతాంగం మరింతగా దివాలా తీయనున్నారు.

### రైతుల (సాధికారిత, రక్షణ) ధరలహామీ, సేవల ఒప్పంద చట్టం

కార్పొరేటు కంపెనీలు రైతులతో చేసుకునే వ్యవసాయ ఒప్పందాలకు చట్టబద్ధత కల్పిస్తూ ఈ చట్టం చేశామన్నారు.

బలిసిన కార్పొరేటు కంపెనీల ముందు బక్కరైతులను బలిపశువులుగా కట్టిపడవేసే చట్టం ఇది. ఈ చట్టంలోని మార్గదర్శకాల ప్రకారం కార్పొరేటు కంపెనీకి-రైతుకు మధ్య ఒప్పందంలో వివాదాలు తలెత్తితే ఏ న్యాయస్థానమూ జోక్యం చేసుకోదు. రెవిన్యూ అధికారుల దయాదాక్షిణ్యాలపై రైతు ఆధార పడాలి. కార్పొరేట్ కంపెనీకి అన్నివిధాలా అనువుగానూ, రైతుకు నష్టదాయకంగానూ వున్న చట్టమిది.

2012 సం॥లోనే కాంట్రాక్టు సేద్యాన్ని ప్రోత్సహిస్తూ కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఏ ప్రభుత్వం ఒక నమూనా చట్టంచేసి దాని ప్రకారం రాష్ట్రాల చట్టాలలో మార్పులు చేయమని కోరింది. దీనికనుగుణంగా ఆంధ్రప్రదేశ్ మార్కెట్ చట్టం-1969కి రాష్ట్రంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం సవరణలు చేసింది. కేంద్రప్రభుత్వం ఈనాడు చేసిన చట్టం దీని కొనసాగింపే.

పంజాబ్ రాష్ట్రంలో పెప్సీకంపెనీ సేద్య ఒప్పందం చేసుకొని రైతులతో బంగాళదుంప పంట వేయించింది. ఒక ఏడాది అనుకూల పరిస్థితుల్లో దిగుబడి బాగా వచ్చింది. ఎక్కువ సరుకు తనకు అవసరం లేదంటూ పెప్సీ కంపెనీ ఆ పంటను కొంతభాగమే కొనుగోలు చేసింది. మిగిలిన పంటను కిలో పావలాకు కూడా కొనే దిక్కులేక రైతాంగం నష్టపోయారు. మరో ఏడాది వానలులేక బంగాళదుంప దిగుబడి తగ్గింది. అప్పుడు నాణ్యత సరిగా లేదనే సాకుతో కంపెనీ, ధరను దిగకోసింది. కావున దిగుబడులు పెరిగినా, తగ్గినా నష్టాలు రైతాంగానివే; లాభాలు కంపెనీవే! కంపెనీ లాభాలను పెంపొందించ టానికి తప్పని సరిగా శ్రమించే బంధిత పాలేర్లుగా రైతులు మిగిలిపోవటమే జరుగు తుంది. రైతాంగం తమ అస్తిత్వాన్ని కోల్పోతారు.

మరోవైపున విశాల భూఖండాలలో కాంట్రాక్టు సేద్యం సాగించే కంపెనీలు, వ్యవసాయ పనులలో యంత్రాల వినియోగాన్ని పెంచి గ్రామీణ పేదల జీవనోపాధిని దెబ్బ తీస్తారు. గ్రామీణ ప్రాంతాల నుండి వలసలు పెరిగి, వారంతా కారుచౌక శ్రమశక్తిగా మలచబడతారు.

### నిత్యావసర సరుకుల (సవరణ)చట్టం

నిత్యావసరాలైన చిరుధాన్యాలు, పప్పులు, నూనెగింజలు, కూరగాయలు, పండ్లు మొదలైన వాటి నిల్వలపై ఆంక్షలను తొలగించివేస్తూ చేసిన ఈ సవరణ దేశ ప్రజలందరిపై ధరల పెనుభారాన్ని మోపుతుంది. ప్రస్తుతం నిత్యావసరాలపై నియంత్రణ వుందనుకుంటేనే, ధరలపై ప్రభుత్వాలకు అదుపు లేదు. ఇక నియంత్రణ ఎత్తివేస్తే వ్యవసాయ వాణిజ్యసంస్థలు చౌక ధరలకు భారీగా పంటలను కొని నిల్వచేసి కృత్రిమ కొరత సృష్టించి పెద్దఎత్తున లాభాలను దండుకుంటాయి.

చిల్లర వర్తకంలోకి వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించటంతో దేశవ్యాపితంగా స్వయం ఉపాధిద్వారా ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న 8 కోట్ల కుటుంబాల భవితవ్యం ప్రశ్నార్థకం కానుంది.

కాంట్రాక్టు వ్యవసాయం ద్వారా మార్కెట్‌లో తమకు లాభదాయకమైన పంటలనే ఆయా కంపెనీలు రైతులచే పండిస్తాయి. ప్రజలందరికి అవసరమైన సమగ్ర పంటల పెంపకం జరగదు. ఫ్యూచర్ ట్రేడింగ్‌లతో నిల్వ చేసుకోవటం, ఫార్వర్డ్ ట్రేడింగ్‌లతో దేశంలో ఏమూలకైనా చేరవేయటం వంటి విధానాలతో రైతులేగాక దేశ ప్రజానీకమంతా ఆహార కొరతను, ధరల భారాలను మోయాల్సి వస్తుంది.

### ఈ మూడు చట్టాలలోనూ కీలకాంశం

వ్యవసాయ మార్కెట్ యార్డులను క్రమంగా రద్దుచేసి

రైతులకుండే కనీసపాటి రక్షణను తొలగించటం; మద్దతుధరల ప్రకటనను కూడా ఎత్తివేసి రైతులను మార్కెట్ దళారీల ఎదుట నిస్సహాయంగా నిలబెట్టటం; సేద్య ఒప్పందం పేరున బక్కచిక్కిన రైతును బలిసిన కంపెనీల ఎదుట బలిచేయటం; నిత్యావసరాలపై నియంత్రణను ఎత్తివేసి, ఫ్యూచర్ ట్రేడింగ్, ఫార్వర్డ్ ట్రేడింగ్‌లను అనుమతించటం-వంటి మరెన్నో వ్యవసాయ వ్యతిరేక, రైతాంగ వ్యతిరేక విధానాలు ఈ చట్టాలలో ఇమిడి వున్నాయి. వీటన్నిటి ఏకైక లక్ష్యం మనదేశంలో చిన్న, మధ్యతరగతి రైతులను దివాలా తీయించి, క్రమంగా వారిని భూములనుండి దూరం చేయటం; కొందరిని తమ కంపెనీ లాభాలకోసం బంధిత పాలేర్లుగా కట్టివేసి శ్రమదోపిడీ చేయటం.

దీనివెనుక కేవలం సామ్రాజ్యవాద దేశాల, బహుళజాతి కంపెనీల వ్యాపార, ఆర్థిక ప్రయోజనాలు మాత్రమేగాక, దేశ స్వయం పోషకం, స్వావలంబనలను దెబ్బతీసే దోపిడీవర్గ ప్రయోజనాలు కూడా ముడివడి వున్నాయి. దేశంలో ప్రజలకు అవసరమైన ఆహార, ఇతర అవసరాలకోసం ఎల్లవేళలా సామ్రాజ్యవాద దేశాలపై ఆధారపడి వుండే విధంగా మనదేశ వ్యవసాయాన్ని దెబ్బతీస్తున్నారు. విశాల భూ ఖండాలలో బడావ్యవసాయ వాణిజ్య కంపెనీలు చేపట్టే 'ఒప్పంద వ్యవసాయం'లో పుష్కలంగా లభించే శ్రమశక్తిని కాకుండా యంత్రాల వినియోగం పెంచటం ద్వారా గ్రామీణ జనాభాలో అత్యధికులకు ఉపాధి అవకాశాలను దూరం చేస్తారు. వారంతా పొట్టచేతబట్టుకొని పట్టణాలకు, నగరాలకు, గల్ఫ్‌దేశాలకు వలసలు వెళ్తున్నారు. నగరాల్లోని పరిశ్రమల్లో సామ్రాజ్య వాదులకు, బడాపెట్టుబడిదార్లకు వీరంతా కారుచౌక శ్రమశక్తి కేంద్రాలుగా వుంటున్నారు.

### 'దున్నేవానికే భూమి' నినాద ప్రాసంగికత

భారతదేశంలో నేడున్న అర్థవలస-అర్థ భూస్వామ్య వ్యవస్థలో సామ్రాజ్యవాదం భూస్వామ్యాన్ని తన సాంఘిక పునాదిగా చేసుకొని దోపిడీ సాగిస్తోంది. రైతాంగాన్ని బలవన్మరణాలకు గురిచేస్తోంది; వారిని బాధల విషవలయంలోకి నెట్టివేస్తున్నది. ఈ పరిస్థితిలో 'దున్నేవానికే భూమి' నినాదంతో సాగే పోరాటం- భూస్వాములకు, విశాల భూఖండాల యజమానులకీ లేదా గైర్హాజరీలోనున్న భూస్వాములకు (ఆబ్సెంటీ ల్యాండ్‌లార్డ్) వ్యతిరేకంగా మాత్రమేకాదు; సామ్రాజ్యవాదానికీ, బడాబూర్జువా వర్గానికి కూడా వ్యతిరేకమైన పోరాటంగా సాగుతుంది.

'దున్నేవానికే భూమి' నినాదంగా విప్లవ భూసంస్కరణలు అమలుజరిగితే, దేశంలోని సాగుకు యోగ్యమైన భూములన్నీ సస్యశ్యామల మౌతాయి. దేశీయంగా వ్యవసాయోత్పత్తులపై ఆధారపడిన పరిశ్రమల అభివృద్ధితో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. వ్యవసాయం, పరిశ్రమలలో పెరిగిన ఉపాధి అవకాశాలతో తలసరి ఆదాయాలు పెరుగుతాయి. దీని కనుగుణంగా విద్య, వైద్య రంగాలు పురోగమిస్తాయి.

అందుకే దేశంలో సమగ్రాభివృద్ధికి మూలమైన వ్యవసాయరంగాన్ని కకావికలు చేయటానికి, చిన్నాభిన్నం చేయటానికి దళారీ పాలకుల అండదండలతో సామ్రాజ్యవాదులు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. అందులో భాగమే కేంద్రప్రభుత్వం ముందుకు తెచ్చిన మూడు చట్టాలు అని గ్రహించాలి.

### పోరాటమే ఏకైక మార్గం

బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం ముందుకు తెచ్చిన వ్యవసాయ, రైతాంగ వ్యతిరేక చట్టాలను దేశంలోని 18 పార్లమెంటరీ ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించాయి. ఎన్‌డిఏ కూటమిలో భాగస్వామి అయిన అకాలీదళ్ పార్టీ ఈ చట్టాలను నిరసిస్తూ కేంద్రమంత్రి వర్గం నుండేకాక కూటమినుండి కూడా వైదొలిగింది. తాము అధికారంలోకి వస్తే ఈ 3 చట్టాలను చెత్త బుట్టలోకి చేరుస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించాడు. వీటిని వ్యతిరేకిస్తూ 2 కోట్ల సంతకాల సేకరణకు పిలుపినిచ్చాడు.

ఈ చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాపితంగా రైతులు ఆందోళనలు సాగిస్తూనే వున్నారు. ప్రధానంగా పంజాబ్, హర్యానా, రాజస్థాన్, బెంగుళూరులలో రైతులు పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చారు. 250 రైతు సంఘాలతో కూడిన ఏఐకెసిసి ఆధ్వర్యంలో ఆందోళనా కార్యక్రమాలు సాగుతున్నాయి.

ఇరు తెలుగు రాష్ట్రాలలోని పాలకులు, ప్రతిపక్షపార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కనుగుణంగా నాటకాలాడుతున్నారు. రైతాంగ, వ్యవసాయ వ్యతిరేక, చట్టాలకు వైసిపి, టిడిపిలు మద్దతునివ్వగా, తెలంగాణలో టిఆర్‌ఎస్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నది. పాలకపార్టీలు అధికారంలో వున్నపుడు ప్రజలపై భారాలు మోపుతూ, అధికారం కోల్పోయినపుడు ప్రజలపక్షం వహిస్తున్నట్లుగా నాటకాలాడటం పరిపాటి అయింది. పాలకపార్టీల ఓట్ల రాజకీయ ఉద్యమాలపట్ల ప్రజలు, రైతాంగం అప్రమత్తంగా వుండాలి. వ్యవసాయాన్ని కార్పొరేటీకరించి, రైతాంగాన్ని సామ్రాజ్యవాదుల ముందు మోకరిల్ల జేసే ప్రమాదకరమైన ఈ మూడు చట్టాలకు వ్యతిరేకంగా ఐక్యపోరాటం సాగించాలి. ఈ చట్టాలు కేవలం రైతాంగం, గ్రామీణ ప్రజానీకానికి మాత్రమేకాక, దేశప్రజలందరికి వ్యతిరేకమైనవిగా గ్రహించాలి. రైతాంగం, కార్మికవర్గం, విద్యార్థి, మేధావులతో కలిసి ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఐక్యఉద్యమం సాగించాలి.

ooo